




కలుగోడు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు కాలవ నాగరాజుకు నియామకపత్రం ఇస్తున్న కాలవ శ్రీనివాసులు





మృతి చెందిన చిన్నారి అధర్వ



రత్నమ్మ



మనోజ్

విషాదాంతం..!

కుమారుని కేశఖండన నిమిత్తం బంధువులతో కలిసి ఎంతో సంతోషంగా తిరుపతికి వెళ్లారు. అందరూ ఎంతో సంతోషంగా గడుపుతూ మూడేళ్ల తన కుమారునికి వెంకన్న సన్నిధిలో తలనీలాలు సమర్పించారు. దైవర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో ఇంటికి బయల్దేరారు. వాహనంలో కూర్చొన్న అందరూ బంధువులు కావడంతో రాత్రంతా సరదాగా కబుర్లు చెప్పకున్నారు. మరో గంట సేపులో స్వగ్రామం చేరేలోపు వారి ప్రయాణం విషాదాంతం అయ్యింది. వీరు ప్రయాణిస్తున్న ఐచర్ వాహనం ఆగి ఉన్న లారీ ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. పది మంది గాయపడ్డారు. మడకశిర మండలం బుల్లసముద్రం వద్ద శనివారం వేకువజామును 5 గంటలకు జరిగిన ఈ ప్రమాదం పలు కుటుంబాల్లో చీకట్లను మిగిల్చింది.

- మడకశిర వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని ఢీకొన్న టెంపోట్రావెలర్ వాహనం
- నలుగురి మృతి
- 10 మందికి గాయాలు
- మృతులంతా బంధువులు
- శోకసంద్రంలో కెఎన్.పల్లి

ప్రజాశక్తి-మడకశిర, గుడిబండ

మడకశిర నియోజకవర్గం అమరాపురం, గుడిబండ మండలం కెఎన్.పల్లి గ్రామానికి రిటైర్డ్ టీచర్ దాసేగౌడ్ కుటుంబ సభ్యులు, బంధువులు ఈ నెల 19వ తేదీ తిరుపతికి వెళ్లారు. కెఎన్.పల్లికి చెందిన ప్రేమకుమారి, శివరాజ్‌ల కుమారుడు అధర్వ(4సం॥) కేశఖండన నిమిత్తం వీరంతా రెండు వాహనాల్లో తిరుపతికి వెళ్లారు. కేశఖండన, దైవర్శనం అనంతరం శుక్రవారం రాత్రి రెండు వాహనాల్లో స్వగ్రామానికి బయల్దేరారు. శనివారం వేకువజామున 5 గంటలకు వారు ప్రయాణిస్తున్న టెంపోట్రావెల్ మడకశిర మండలం బుల్లసముద్రం వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆపి ఉంచిన లారీని వేగంగా వచ్చి ఢీకొంది. తుఫాన్ వాహనంలో ఉన్న తల్లీకుమారుడు ప్రేమకుమారి(30), అధర్వ(4), అమరాపురానికి చెందిన రత్నమ్మ(68), కర్నాటకకు చెందిన డ్రైవర్ మనోజ్(32) ఘటనా స్థలంలో మరణించారు. వీరితో పాటు కెంపన్న, కెంచమ్మ, గీత లక్ష్మి, సుజాతమ్మ, గిరిజమ్మ, నాగమణి, ఉష, అమాజమ్మ, శ్రీదేవి, శ్వేతలు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ప్రమాద విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఉపాధ్యాయురాలు సజాత, గిరిజమ్మ, శ్రీదేవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు. వీరితో పాటు మరికొందరిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

శోకసంద్రంలో కెఎన్.పల్లి

బుల్లసముద్రం గ్రామం సమీపంలో జరిగిన ప్రమాదంలో కెఎన్.పల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ప్రేమ కుమారి ఆమె కుమారుడు అతర్వ (4) సమీప బంధువు రత్నమ్మ మరణించారు. కేశఖండన నిమిత్తం వెళ్లిన వారు అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో కెఎన్.పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. తల్లీకుమారుడు మృతదేహాలను చూసి పలువురు కన్నీటి పర్యవంతం అయ్యారు.

ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి

మడకశిర వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మడకశిర ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను మడకశిర ఆసుపత్రిలో పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, రొళ్ల జెడ్పిటీసీ అనంతరాజు, గుడిబండ జెడ్పిటిసీ పోతరాజు, తెలుగుదేశం పార్టీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకష్ణ తదితరులు పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మృతులు గాయపడిన వారు టిడిపి రైతు సంఘం నాయకులు సురేష్ బంధువులు కావడంతో టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. సిడబ్ల్యుసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం అత్యంత విచాకరం అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఘటనా స్థలానిన ఎస్పీ పరిశీలన

ప్రమాదం జరిగిన బుల్లసముద్రం రోడ్డు ప్రాంతాన్ని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులు, స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మడకశిర ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆమె వెంట పెనుగొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర సిఐ రాజకుమార్, రాగిరి రామయ్య ఉన్నారు.



మడకశిరలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్పీ వి.రత్న

ప్రాజెక్టు కమిటీ ఎన్నికలూ ఏకగ్రీవమే..!

- టిబిసి ఛైర్మన్ పదవి కడప జిల్లా నేతలకే..
- వైస్ ఛైర్మన్‌తో సర్దుకున్న అనంత నేతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలూ ఏకగ్రీవం అయ్యాయి. శనివారం జరిగిన ఈ ఎన్నికలు ప్రశాంతంగానూ సాగాయి. ఎప్పటిలాగానే ఈసారి కూడా కడప జిల్లాకే ఛైర్మన్ పదవి దక్కింది. వైస్ ఛైర్మన్‌తో అనంతపురం జిల్లా నేతలు సరిపెట్టుకున్నారు. శనివారం ఉదయం అనంతపురం నగరంలోని హెచ్‌ఎల్‌సి కార్యాలయంలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జరిగాయి. 12 డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు కలసి ఎన్నుకునే ఈ ఎన్నికల్లో అనంతపురం జిల్లా నుంచి ఐదు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు, కడప జిల్లా నుంచి ఆరుగురు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు, ఆలూరు డిస్ట్రిబ్యూటరీ నుంచి ఒకరు ఎన్నికలో సభ్యులుగా ఉన్నారు. అధ్యక్ష పదవిని ఈసారి ఎలాగైన దక్కించుకోవాలని అనంతపురం జిల్లా నేతలు పోటీపడ్డారు. హెచ్‌ఎల్‌ఎంసి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు కేశవరెడ్డి, అటు కడప జిల్లా నుంచి కసనూరు డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు మారెడ్డి జోగిరెడ్డి పోటీపడ్డారు. ఇటు వైపు నుంచి కాలవ శ్రీనివాసులు ప్రయత్నించగా, అటు బిటెక్ రవి ప్రయత్నించారు. ఇద్దరి మధ్య పోటీ ఉండే అవకాశముందని భావించారు. అయితే అధిష్టానం నుంచి వచ్చిన సంకేతాల అనుగుణంగా పోటీని నివారించడంలో భాగంగా కడప జిల్లాకు చెందిన కసనూరు డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు మారెడ్డి జోగిరెడ్డికి అధ్యక్ష పదవిని ఇవ్వాలని నిర్ణయించారు. కేశవరెడ్డికి వైస్ ఛైర్మన్ పదవి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారమే శనివారం జరిగిన ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో మారెడ్డి జోగిరెడ్డి అధ్యక్షుడిగానూ, కేశవరెడ్డి ఉపాధ్యక్షుడిగానూ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన హెచ్‌ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్ ధ్రువీకరించారు.

వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా రాజకీయం చేస్తున్నాం : బిటెక్ రవి

'మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు వ్యతిరేకంగా ఆయన సొంత ప్రాంతంలో రాజకీయం చేస్తున్నాం.. మాకు రాష్ట్ర స్థాయి మద్దతు కావాలి' అని టిడిపి నాయకులు బీటెక్ రవి పేర్కొన్నారు. హెచ్‌ఎల్‌సి ప్రాజెక్టు ఎన్నికల సందర్భంగా ఆయన మద్దతుగా ఇక్కడి విచ్చేశారు. ఎన్నిక అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి విలువ తెలిసిన వాళ్లం.. చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కడప జిల్లాలో 32 సాగునీటి సంఘాలను టిడిపి కైవసం చేసుకుందని తెలిపారు.

భైరవానితిప్పకు ఏకగ్రీవం

గుమ్మఘట్ట : భైరవానితిప్ప ప్రాజెక్టు ఎన్నికలూ ఏకగ్రీవమయ్యాయి. కలుగోడు డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులుగా కాలవ నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బుడిమేపల్లి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షులు సుబహాన్ ఎన్నికయ్యారు. వీరికి ప్రభుత్వం విప్, రాయదుర్గం కాలవ శ్రీనివాసులు నియామక పత్రాలను అందించారు.

వైవిఆర్ ప్రాజెక్టు ఛైర్మన్‌గా జయప్రకాశ్

ముదిగుబ్బ : మండలంలోని వైవిఆర్ ప్రాజెక్టు ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఛైర్మన్‌గా గోడి జయప్రకాశ్ నాయుడు, వైస్ ఛైర్మన్‌గా శివయ్యలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మురళి ధ్రువీకరించారు. వీరిని టీడీపీ నాయకులు ప్రభాకర్, తుమ్మల మనోహర్ నాయుడు అభినందించారు.

నేటి నుంచి ఆర్డీటీలో అండర్-19 క్రికెట్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం వేదికగా బీసీసీఐ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా అండర్-19 కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఆదివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆంధ్ర, మహారాష్ట్ర జట్లు తలపడే ఈ మ్యాచ్ ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఇరు రాష్ట్రాల జట్లు అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి చేరుకుని ముమ్మరంగా సాధన చేశారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు.



నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిపిఎం తోరణాలు

సిపిఎం మహాసభలకు ముస్తాబు


ఎర్రజెండాలతో ఎరుపెక్కిన అనంత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం 14వ మహాసభలకు అనంతపురం నగరం ముస్తాబవుతోంది. ఈ నెల 23,24వ తేదీల్లో అనంతపురం కేంద్రంగా మహాసభలు జరగనున్నాయి. ఇందులో భాగంగా నగరంలో ప్రధాన సర్కిళ్లలో సిపిఎం జెండాలు, తోరణాలను ఆ పార్టీ కార్యకర్తలు ఎరుపుమయం చేస్తున్నారు. 11 సంవత్సరాల తర్వాత జిల్లా మహాసభలు నగరంలో జరుగుతున్న నేపథ్యంలో ఇందులో కార్మికులు, రైతులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నాయకులు పాలు పంచుకుంటున్నారు. ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, కవులు, రచయితలు, మేధావులు, వేలాదిమందితో ఈనెల 23న బహిరంగ సభ జరగనుంది. ఇందులో భాగంగా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం నగరంలో స్కూటర్ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తెలిపారు.

సుజల స్రవంతి భూమి వివరాలు నమోదు

ప్రజాశక్తి-యల్లనూరు



రికార్డులు చూస్తున్న అధికారులు

గాలేరు-నగిరి సుజల స్రవంతి ప్రాజెక్టు యూనిట్-3 కింద మండల వ్యాప్తంగా రైతులు నుంచి సేకరించిన భూముల వివరాలను ప్రాజెక్టు డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం నమోదు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గాలేరు నగిరి సుజల స్రవంతి యూనిట్-3 కింద యల్లనూరుతోపాటు సింహాద్రిపురం, ముద్దనూరు, తొండూరు, యర్రగుంట్ల కొండాపురం, మైలవరం ప్రొద్దుటూరు, వీరపనాయనిపల్లి, దువ్వూరు వంటి 13 మండలాలు ఉన్నాయన్నారు. ఆయా మండలాల్లో 2007 నుంచి 2024 వరకూ రైతుల నుంచి భూములను సేకరించామన్నారు. ఇందుకు పరిహారం చెల్లించేందుకు ఆయా భూముల వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు మండల సర్వేయర్ బాల గంగయ్య, యల్లనూరు సర్వేయర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలను పనిఒత్తిడికి గురి చేయొద్దు

డిఎంఅండ్‌హెచ్‌ఒకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విధులతో సంబంధం లేని పనులు చేయిస్తూ ఆశాలను పని ఒత్తిడికి గురి చేయొద్దని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్, సిఐటియు ఉపాధ్యక్షులు ఎటిఎం.నాగరాజు,చంద్రలు డిఅండ్‌హెచ్‌ఒను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లతో విధులకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఫీల్డ్ వర్క్ చేయాల్సిన ఆశలను హెల్త్ సెంటర్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోవాలని చెబుతున్నారన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు సచివాలయాల వద్దకు రావాలని ఎఎన్ఎంలు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తాడిపత్రిలో డ్రైడేఫ్రైడే పేరుతో ఉదయం 6 గంటలకే రావాలని ఆశలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గుత్తి రూరల్ బేతపల్లి పిహెచ్‌సిలో టీబీ పేషెంట్ల గల్ల పరీక్షకు గల్ల డబ్బాలు ఆశల తీసుకెళ్లి టెస్ట్ చేయించాలంటూ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇతర విధులతో ఆశాలపై పనిభారం ఎక్కువ అవుతోందన్నారు. వీటిపై స్పందించి ఆశాలపై పని ఒత్తిడి తగ్గించి అనవసరంగా హెల్త్ సెంటర్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఇన్‌ఛార్జి కలెక్టర్ పరామర్శ

ఇంటిపట్టాతోపాటు నగదు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



బాధితురాలికి ఇంటి పట్టా, చెక్కు అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న సిమెంటు కార్మాగారంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన మండలంలోని క్రిష్టిపాడుకు చెందిన శివకేశవ కుటుంబాన్ని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ శనివారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఘటన వివరాలు.. ప్రస్తుతం మృతుడి భార్య ఉంటున్న పరిస్థితులను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఆయన లేని లోటు మాకు శాపమని, ఇద్దరు పిల్లల్ని చూసుకోవాలంటే కష్టతరంగా మారిందని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎదుట మృతుడి భార్య వాపోయింది. ఈ సందర్భంగా అధైర్యపడవద్దని.. ప్రభుత్వ పరంగా అన్నివిధాలుగా ఆదుకుటామని మృతుడు భార్య గీతకు భరోసా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం నుంచి ఇస్తున్న రూ.1లక్ష, ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, యాడికి, పెద్దవడుగూరు మండలాల తహశీల్దార్లు ఉషారాణి, ప్రతాపరెడ్డి, ఎస్ఐ ఆంజనేయులు, ఆర లహరిక, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు సుదర్శనరెడ్డి, రామాంజనేయులు, రామేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

శాంతి భద్రతల పరిరక్షణతోపాటు మహిళల భద్రత విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కసాపురం గ్రామంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికి గోత్రనామాలతో స్వామికి అర్చనలు, పూజలు చేసి స్వామి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, శాంతి, భద్రతలకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేస్తూనే ఇదివరకే జరిగిన నేరాల్లో రికవరీలు పెంచాలన్నారు. యు.ఐ కేసులు, అనుమానాస్పద మృతుల కేసుల్లో జాప్యం లేకుండా పరిష్కారం చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు సేఫ్టీ, ఉల్లంఘనలపై పక్కాగా చర్యలు ఉండాలన్నారు. మట్కా, పేకాట తదితర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. గంజాయి, తదితర మత్తు పదార్థాలపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో సిసి కెమెరాల అభివృద్ధికి కషి చేయాలన్నారు. శివారు కాలనీల్లో డ్రోన్లు ఎగురవేసి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎ.శ్రీనివాస్, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్, సబ్ డివిజన్ సిఐలు బి.మనోహర్, మస్తాన్, ప్రవీణ్‌కుమార్, చిన్నగౌస్, మహానంది, రాజు, వెంకటేశ్వర్లు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలాలను ఎస్పీ జగదీష్ శనివారం పరిశీలించారు. ఇటీవల కూల్చివేసిన శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని పరిశీలించి స్థలం వివరాలను సిఐ బి.వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ సాయిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నేరాలు నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఓ మారుతి, టిపిబిఓ అప్పుస్వామి, వీఆర్వో టి.సురేంద్ర, హెడ్ కానిస్టేబుల్ జాఫర్, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు రోగాల బారిన పడుతున్నా పట్టించుకోరా..?

కౌన్సిల్ మీట్‌లో కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారి ప్రజలు రోగాల బారిన పడి చనిపోతున్నా పట్టించుకోరా..? అంటూ 17వ వార్డు కౌన్సిలర్ నాగరత్న ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగరత్న మాట్లాడుతూ తన వార్డులో పారిశుధ్యం అస్తవస్తంగా తయారైందన్నారు. డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. అయినా ఫాగింగ్ చేయడం లేదని మండిపడ్డారు. మూడు రోజుల క్రితం గురుదీక్షిత్ అనే 11 ఏళ్ళ బాలుడు డెంగీతో మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు శానిటరీ ఇన్స్‌పెక్టర్ హరినాథ్ స్పందిస్తూ పట్టణంలోని పారిశుధ్యం లోపించిన మాట వాస్తవమేనని.. ఇక ముందు అలా జరగకుండా చూస్తామన్నారు. అలాగే మురికి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణానికి రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని 32వ వార్డు కౌన్సిలర్ సుధాకర్ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు వైసిపి కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని 7వ వార్డు కౌన్సిలర్ లింగన్న ఆరోపించారు. దీంతో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సమావేశంలో కమిషనర్ నయీమ్ అహమ్మద్, ఎంఇ లీలాకృష్ణ ప్రసాద్, డిఇ సురేష్, రెవెన్యూ అధికారి తారక్‌నాథ్, మెప్మా ప్రాజెక్ట్ అధికారి మోహన్, టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ సత్తార్, ఎఇ హరికృష్ణ, ఆర్ఐ ఎర్రిస్వామి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు గోవిందరావు, హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిల్ సభ్యురాలు

శ్రామిక మహిళలకు అంకితం

స్వా సొతిండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు గ్రహీత విశాల ఫెర్రర్



ప్రజాశక్తి-అనంతపురం

సామాజిక సేవలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు–2024కు ఆర్‌డిటి మహిళా విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్ ఎంపికయ్యారు. ఈమేరకు ఈనెల 22న బెంగళూరులో ఆమె అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతలో భాగంగా మహిళల అభ్యున్నతికి కృషి చేసినందుకు అవార్డుకు అర్హత సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్‌డిటి ద్వారా తాము లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో, మహిళలకు సాధికారత కల్పించడంలో, ఇండియా ఫర్ ఇండియా ప్రాజెక్ట్, సింగిల్ మదర్స్ ప్రోగ్రాం వంటి ప్రభావవంతమైన కార్యక్రమాలను నడపడంలో విప్లవాత్మక ప్రయత్నాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడం నుంచి గ్రామీణ వృద్ధిని పెంపొందించేంత వరకూ శ్రమశక్తి మహిళల ప్రయాణం జీవితాలను మారుస్తోందన్నారు. తమ కృషి ఒకరిది కాదని.. శ్రామిక మహిళల అందరిదీ అన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా శ్రీదేవి, యువజన విభాగం అధ్యక్షులుగా సాకే చంద్రశేఖర్, రైతువిభాగం అధ్యక్షులుగా నారాయణరెడ్డి, బిసి సెల్ అధ్యక్షులుగా కురుబ దేవేంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మల్లెమీద నరసింహులు, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా సైఫుల్లా బేగ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ప్రసాద్‌బాబు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులుగా చంద్రశేఖర్‌యాదవ్, పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులుగా యోగేంద్రరెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షులుగా సుంకప్ప, ఆర్టీఐ వింగ్ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, వాలంటీర్ల వింగ్ అధ్యక్షులుగా ధనుంజయ, గ్రీవెన్స్ సెల్ బాకె హాబీబుల్లా, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా రేవన్న, వీవర్స్ వింగ్ అధ్యక్షులుగా నాగప్ప, ట్రేడ్ యునియన్ అధ్యక్షులుగా ఓబిరెడ్డి, అంగన్వాడీ విభాగం సంధ్యారాణి, లీగల్ సెల్ అధ్యక్షులుగా ఉమాపతి, కల్చరల్ వింగ్ నాగరాజు, సోషల్ మీడియా వింగ్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఐటీ వింగ్ రాజశేఖర్‌రెడ్డి, దివ్యాంగుల వింగ్ ఉపేంద్రగౌడ్, డాక్టర్స్ వింగ్ బొమ్మయ్య, బూత్ కమిటీస్ వింగ్ అమర్‌నాథ్‌రెడ్డి, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులుగా రమేష్‌బాబు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా విజయభాస్కర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాల్ బ్యాడ్మింటన్ దినోత్సవం

అనంతపురం సిటీ : అనంతపురం జూనియర్ కళాశాల మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ దినోత్సవ వేడుకలను అనంతపూర్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ ఈశ్వరయ్య, సీనియర్ క్రీడాకారుడు డి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ జమ్మలమడక పిచ్చయ్య జయంతిని పురస్కరించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు రియాజుద్దీన్, మహబూబ్ బాషా, బాబా, తదితరులు పాల్గొన్నారు.

మృతులకు విప్ నివాళి

రాయదుర్గం : సత్యసాయి జిల్లా గుడిబండ మండలం, బుళ్లసముద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై విప్ కాలవ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకుని క్షేమంగా ఇంటికి చేరుకోవాలని కోరారు. అంతేగాకుండా ప్రభుత్వం తప్పక వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఇకపోతే డి.హీరేహాల్ మండలం మురడి ఎంపిటిసి సభ్యుడు తలారి గంగాధర్ భార్య లక్ష్మి మృతిచెందడంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం తెలిపారు.

సభ్యత్వ నమోదుకు విరాళం

అనంతపురం రూరల్ : టిడిపి సభ్యత్వ నమోదు కోసం మాజీ కార్పొరేటర్ సరళ శనివారం 50 వేల విరాళం అందజేశారు. ఈమేరకు అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు 43వ డివిజన్ నాయకులతో కలిసి సంబంధిత మొత్తాన్ని అందించారు. అనంతరం సరళను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని శనివారం వెల్లుట్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానికులు తహశీల్దార్ శేషారెడ్డికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపివిబిఎస్ జిల్లా కార్యదర్శి యలమకూరి సతీష్, లక్ష్మీనారాయణ, గోపాల్, ఓబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలు

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి దేవి



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. శనివారం నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టంపై మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, తదితర జన సంచార ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సచివాలయం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించారు. కర్ణాటక సరిహద్దు జిల్లాల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించి లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు సుజాత, యుగంధర్, అనసూయ, రవిశంకర్, సర్వజన ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణులు రవికుమార్, స్త్రీ విభాగం నిపుణులు నిస్సార్ బేగం, ప్రసన్న భారతి, పీడియాట్రిషన్ లక్ష్మి, డిపిఆర్ఒ గురుమూర్తి, డెమో, త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, ఐసిడిఎస్ సిడిపిఒ వెంకటకుమార్, ఆర్డీటీ డాక్టర్ దుర్గేష్, రెడ్స్ అనిత, హెడ్స్ రామ్మోహన్, ఆరోగ్య బోధకులు వేణు, వెంకటేష్, శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్ ఆషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్తలు



పరిశోధక విద్యార్థినులతో అతిథులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

ఆధునిక పద్ధతులతో కూడిన వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు లాభం చేకూరుతుందని మార్కాపురం ఎన్ఎస్ అగ్రికల్చర్ డీఎన్ఆర్‌విఎస్‌కె.రెడ్డి, వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్తలు నారాయణస్వామి, చిరుధాన్యాల శాస్త్రవేత్త మాధవీలత సూచించారు. శనివారం మండల పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో సర్పంచి మౌనిక అధ్యక్షతన రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో ఆహార భద్రత, పోషక విలువలను పెంపొందించుకోవచ్చన్నారు. కెవికె ఆధ్వర్యంలో రైతు సదస్సులో ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల మార్కాపురం బిఎస్ అగ్రికల్చర్ విద్యార్థులు నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శన అధికారులు తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఎఒ పృథ్వీసాగర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలాజీ, మల్లికార్జున, హరిణి, వ్యవసాయ శాఖ సిబ్బంది, మాజీ సహకార సంఘం అధ్యక్షులు వెంకటనాయుడు, నాయకులు రాధాకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి : జెడిఎ

రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండల పరిధిలోని దుద్దేకుంట, కాలువపల్లి గ్రామాల్లో చేపట్టిన ఈ–పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరగతిన ఈ–పంట నమోదును పూర్తి చేసి ఇకెవైసి పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. దీంతోపాటు రైతులు ఈనెల 31వతేదీలోపు వాతావరణ బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. అనంతరం కాలువపల్లి రైతు సేవాకేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పృథ్వీసాగర్, ఎఇఒ భాగ్య, వైస్ ఎంపిపి తిమ్మప్ప అర్చన, రోజా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నడిమిదొడ్డి ప్రాథమిక పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ వై.మహేంద్ర నాథ్ శనివారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల ఎత్తు, బరువు, ఛాతీ చుట్టుకొలత, మిడ్ అపరారం హెడ్ సర్కంఫరెన్స్ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పర్యవేక్షకులు ఎం.శ్రీరాములు, ఆరోగ్య కార్యకర్త విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి సరిత, ఎఎన్ఎం సి.నారాయణమ్మ, ఆశా కార్యకర్త లక్ష్మీదేవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం–4లో ఉన్న పిల్లలకు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి లోకేష్‌కుమార్ శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లల ఆరోగ్య విషయాలతోపాటు ఎత్తు, బరువు నైపుణ్యతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-నార్పల

ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఉప సర్పంచి అలం వెంకట నరసానాయుడు సూచించారు. శనివారం మండలంలోని బొందలవాడ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులు, కూలీలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టే పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఓబన్న, ఎపిఒ ఎర్రమ్మ, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 1వరోడ్డు శివాలయంలో ఏర్పాటు చేసిన ధ్యాన మందిరంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇందుకోసం రోజూ గంట సమయం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, బ్రహ్మ విశ్వకుమారి సంస్థ ప్రతినిధి శారద, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురంలోని 2వరోడ్డులో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ కుంటుపడిందన్నారు. ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, నగరపాలక సంస్థ మహమ్మద్ వసీం, డిప్యూటి మేయర్లు, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుట్లూరు మండలం జంగంరెడ్డిపేటలో కేక్ కోస్తున్న సర్పంచి రామానుజన్‌రెడ్డి


బుక్కరాయసముద్రం : మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబ శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న చేసిన అభివృద్ధికి నిదర్శనంగా ప్రతిగ్రామంలో ఆయన జన్మదినాన్ని ప్రజలు జరుపుకుంటున్నారన్నారు. దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకులు చేయని విధంగా కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. అలాంటి జగనన్న ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని జంగంరెడ్డిపేట సర్పంచి రామానుజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోసం పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామానుజన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకులు చేయని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జగనన్న ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుని, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న వైసిపి నాయకులు

శింగనమల : మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామంలో శనివారం సాయంత్రం వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులోఉ భాగంగా జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కోసం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి పరందామరెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శింగనమల మండలం ఉల్లికల్లులో సంబరాలు చేసుకుంటున్న వైసిపి నాయకులు

పెను విషాదాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రమాదాలు అనేక మంది కుటుంబాల్లో పెను విషాదాలను నింపుతున్నాయి. ఈ వారంలో శనివారం తెల్లవారుజామునే జరిగిన రోడ్డు ప్రమాదంలో బంధువులైన చెందిన నలుగురు మృత్యువాతపడ్డారు. తిరుమల దర్శనానికి వెళ్లివస్తుండగా తెల్లవారుజామున వారు ప్రయాణిస్తున్న టెంపో ట్రావెలర్ ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అంతకు మునుపు నెలలో కూడా రోడ్డు ప్రమాదాలు పెద్దఎత్తున చోటు చేసుకోవడం గమనార్హం. గార్లదిన్నె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీలు మృతిచెందారు. వ్యవసాయ పనులు చూసుకుని స్వగ్రామానికి వెలుతుండగా జరిగిన ప్రమాదంలో కూలీలు చనిపోయారు. అది జరిగిన కొద్ది రోజుల్లోనే విడపకల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు డాక్టర్లు మృతి చెందారు. ఆటో ప్రమాదం మినహా పై రెండు ప్రమాదాలు తెల్లవారుజామున జరిగాయి. చలికాలం కావడంతో మంచు కప్పుకున్న సమయంలో ఎదురుగా రహదారి కనిపించగా ప్రమాదాలు జరిగినట్టు తెలుస్తోంది. సాధారణంగా కూడా రోడ్డు ప్రమాదాలు నవంబర్, డిశెంబర్ మాసాల్లోనే అత్యధికంగా జరుగుతుంటాయని గణాంకాలు చెబుతున్నాయి. అది కూడా ఉదయం సమయంలోనే అత్యధికంగా జరుగుతున్నాయి. చలితోపాటు మంచు కప్పుకుని ఉండడంతో ఎదురుగానున్న వాహనాలు సరిగా కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాల రూపంలో సగటున ఏడాదికి 500 మంది దాక ఈ ప్రమాదాల్లో చనిపోతున్నారు. అప్రమత్తతే ప్రమాదాల నివారణకు మార్గమని అధికారులు సూచిస్తున్నారు. ఇక ఈ వారంలో యాడికి మండలం బోయరెడ్డి గ్రామంలోని ఆదాని పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదం చర్చనీయాంశమైంది. సిమెంటు పరిశ్రమలోని కోల్ యూనిట్‌లో నిప్పు కణికలు మీదపడటంతో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. ఇందులో ఒకరు చనిపోయారు. తక్కిన వారు గాయపడ్డారు. యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు పాటించకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఇటువంటి ప్రమాదాలు జిల్లాలో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఆదాని పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనకు సంబంధించి వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు జిల్లా సేఫ్టీకమిటీకి అప్పగించారు. ఆ కమిటీ ఎటువంటి నివేదికను ఇవ్వనుందన్నది చూడాల్సి ఉంది.

ఈ వారంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా సజావుగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డిస్ట్రిబ్యూటరీల ఎన్నికలు, శనివారం నాడు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయి. రైతాంగ సమస్యలపై వైసిపి ఈ వారంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. అనంతరం కూడా అధికారులకు వినతిపత్రాలు అందజేసింది. అధికారపార్టీ నేతలు దీన్ని కొట్టిపడేశారు. అధికారంలో ఉండగా రైతాంగ సమస్యలను పట్టించుకోని వైసిపి ఇప్పుడు ఆందోళనలు చేయడాన్ని విమర్శించారు.

నేడు అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

అనంతపురం కలెక్టరేట్ : అంబికా ఫౌండేషన్, అమరరాజా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్హత పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, అన్ని డిగ్రీలు ఉత్తీర్ణులై, ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా అర్హులే అన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్..9000024919, 9000433990 నెంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపి కోరారు.

రూఫ్ టాప్ సోలార్‌పై అవగాహన కల్పించాలి

శింగనమల : మండల వ్యాప్తంగా ప్రజలకు రూఫ్ టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డిఇ జొన్నలగడ్డ రమేష్‌బాబు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బందితో మాట్లాడుతూ రూఫ్ టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించి ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ట్రాన్స్‌కో ఎఇ విజయ్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్ వద్దు.. ఓపిఎస్ ముద్దు..

బ్రహ్మసముద్రం : ప్రభుత్వ ఉపాధ్యాయులకు సిపిఎస్ వద్దు.. ఓపిఎస్ ఎంతో ముద్దు అని ఎపిసిపిఎస్ఇఎ సంఘం నాయకులు రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపిసిపిఎస్ఇఎ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సిపిఎస్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిప్పేస్వామి, చైతన్య, గోపాల్‌నాయక్, తిమ్మప్ప, వెంకటనారాయణ, సుమంగళి, హసీనా భాను, అనిత, అర్చన పాల్గొన్నారు.

బండారు లీలావతిపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి-పుట్లూరు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతోపాటు సీనియర్ నాయకురాలు లీలావతిపై దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని మండల టిడిపి నాయకులు హెచ్చరించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నాయకుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యేతోపాటు బండారు లీలావతిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకానికి డబ్బులు వసూలు చేస్తున్నారని అసత్యాలను ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్కే చెన్నారెడ్డి, కడవకల్లు రాజు, ఓబులాపురం ప్రసాద్, తక్కలపల్లి తిప్పారెడ్డి, రంగప్ప, శివనారాయణరెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ బ్లాగ్‌లో ఉద్యోగోన్నతుల జాబితా

అనంతపురం సిటీ : జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీ పాఠశాలల్లోని పాఠశాల సహాయకుల పదోన్నతుల జాబితాను తన బ్లాగులో ఉంచినట్లు డిఇఒ ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సీనియారిటీ జాబితాలోని అభ్యర్థులందరూ తమ సర్వీసు రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో సోమవారం వెరిఫికేషన్ కోసం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్పల : మండల కేంద్రం పరిధిలో, కురుగానిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎఇ రఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరలో అంతరాయం ఉంటుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న కళాశాల వ్యవస్థాపకులు మంజునాథ

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానికవివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఎంబిఎ, ఎంసిఎ పిజి కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు మంజునాథ మాట్లాడుతూ ఇప్పటి యువతలో పోటీతత్వం చాల ఉందన్నారు. దాన్ని సక్రమంగా వినియోగించుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటారన్నారు. ముఖ్యంగా విద్యార్హతతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప, ఇరిగేషన్ విభాగం ఇంజినీర్ పవన్, ట్రెజరర్ గురురాజ్, కళాశాల ప్రిన్సిపాల్ వై.హనుమాన్‌ప్రసాద్, విభాగాధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

కందిపంటలో దోమపురుగు ఉధృతిని అరికట్టాలి

అనంతపురం : కంది పంటలో రైతులు దోమ పురుగు ఉధృతిని అరికట్టాలని ఎడిఎ రవి సూచించారు. శనివారం అనంతపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కూడేరు, ఆత్మకూరు మండల పరిధిలో క్షేత్రస్థాయికి వెళ్లి కంది పంటను పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం కంది పంట కాయ దశలో ఉందన్నారు. అయితే దోమ పురుగు ఉధృతంగా ఉందన్నారు. నివారణకు ప్రొఫెనోఫాస్ లీటరు నీటిలో 2.5 మి.లీ లీటరు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రతి వాహనదారుడు రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయకుమార్ కోరారు. ఈమేరకు శనివారం పట్టణ ప్రధాన రహదారుల్లోని పొలిమేరల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా హెల్మెట్లు ధరించని వాహనదారులకు జరిమాని విధించకుండా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలన్నారు. అలాగే ట్రిబుల్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోల ఓవర్ లోడింగ్, తదితర ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరూ సహకరించాలన్నారు.

సురక్షిత నీరు అందించడమే ఆర్డీటీ లక్ష్యం

ప్రజాశక్తి-కుందుర్పి

గ్రామంలో ఫ్లోరైడ్ నీటిని నివారించి ప్రజలకు శుద్ధమైన నీరు అందించడమే ఆర్డీటీ లక్ష్యమని సర్పంచి గంగాధర్ తెలిపారు. ఈమేరకు శనివారం వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షలతో ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, బిర్లింగప్ప, మురళీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గోవిందు

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని పాత పంచాయతీ కార్యాలయం వెనుక కాలనీలో నివాసం ఉండే ఓ ఆటో డ్రైవర్ శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన గోవిందు(40) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అయితే కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆ బాధను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నగదు చోరీ

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు బొరుగుల అశోక్‌కు చెందిన రూ.75వేల నగదు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బోరంపల్లికి చెందిన బొరుగుల అశోక్ బ్యాంకు నుంచి రూ.75వేలు డ్రా చేసుకున్నాడు. ఇంటికి వెళ్తున్న క్రమంలో కూరగాయలు కొనడానికి పట్టణంలోని బళ్లారి దిన్నె వద్దకు వెళ్లాడు. ఈనేపథ్యంలో ద్విచక్ర వాహనంలో దాచిన నగదు బ్లూ టీషర్ట్‌ను ధరించిన వ్యక్తి ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు వాపోయాడు. అంతేగాకుండా డీఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలో చోరీ జరగడంతో అందరూ విస్మయానికి గురయ్యారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రైతు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



వాల్మీకి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

వాల్మీకి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం రూరల్ : బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపి అంబికా మాట్లాడుతూ సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గదర్శకమైన వాల్మీకి మహర్షి ఆలయాన్ని చెన్నంపల్లిలో నిర్మించడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ అంకే ఈశ్వరయ్య, సంఘం సభ్యులు, గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

గుత్తి ఎలక్ట్రికల్ లోకోషెడ్ వార్షికోత్సవం

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఎలక్ట్రికల్ డీజిల్ లోకోషెడ్ 61వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గుంతకల్లు రైల్వే డివిజన్ డిఆర్ఎం విజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం భారీ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. తర్వాత ఆటల పోటీల విజేత కార్మికులకు బహుమతులు అందజేశారు. ముందుగా డీజిల్ షెడ్‌లో డిఆర్ఎం విజయ్‌కుమార్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఎడిఆర్ఎం సుధాకర్, సిఎంఎస్ వేణుగోపాల్‌రెడ్డి, గుత్తి డీజిల్ షెడ్ సీనియర్ డిఎంఇ ప్రమోద్, గుంతకల్లు డిజల్‌షెడ్డు సీనియర్ డిఎంఇ మంగాచారి, క్యారేజీ వర్క్ షాప్ సీనియర్ డిఎంఇ ముఖేష్, గుంతకల్లు డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మాధవి విజయకుమార్, గుత్తి ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ప్రియాంక, గుత్తి, గుంతకల్లు ఆర్గనైజేషన్ సభ్యులు, బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

పుట్లూరు : రబీలో సాగు చేసిన పంటలకు బీమా నమోదు చేసుకునేందుకు ఈనెల 31వతేదీ వరకూ గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా రబీలో సాగు చేసిన పప్పుశనగ, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న తదితర పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం

ఉరవకొండ : విద్యార్థుల ఆరోగ్యానికి పెంపొందించడమే రాష్ట్రీయ బాల స్వస్థత ఉద్దేశమని వైద్యసిబ్బంది అన్నారు. శనివారం మండలంలోని మైలారంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న 27 అంగన్వాడీ కేంద్రాలు, 15 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పుట్టుకతో లోపాలు, ఇతర వ్యాధులు, పోషకాహార లోపాలు, పిల్లల పెరుగుదలలో ఆలస్యం వంటి వారిని గుర్తించి అవసరమైన చికిత్సకు సామాజిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిఫారసు చేశారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, ఆరోగ్య కార్యక్రమాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఆరోగ్య సహాయకులు ఎం.ప్రసాద్‌రావు, ఎంఎల్‌హెచ్‌పి దివ్యభారతి, ఎఎన్ఎం రాధిక, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాసరామానుజన్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రాజానుజన్ సేవలు మరువలేనివని విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. శనివారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీనివాస రాజానుజన్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రజ్ఞావంతులు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాపంగా గణితశాస్త్ర దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. గణితశాస్త్రంలో ఆయన చేసిన అపారమైన కృషితో అతిపిన్న వయసులోనే ప్రపంచ స్థాయికి ఎదిగారని కొనియాడారు. అంతేగాకుండా ప్రపంచాన్ని ప్రభావితం చేశారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కూడా ఒక లక్ష్యంతో ఉన్నత స్థానానికి చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. అనంతరం పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. తర్వాత గణిత శాస్త్రానికి సంబంధించిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురాం మూర్తి, వృక్షశాస్త్ర అధ్యాపకులు రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌సిసి సిటిఒ కిరణ్, అధ్యాపకులు ఫరీసా, బాబు, విజయ్‌కుమార్, ప్రసాద్, దేవదాస్, సునీల్ కన్నా, వినోద్, మల్లికార్జున, లీలావతి, నాగమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప పాల్గొన్నారు.

అనంతపురం : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని గుత్తి రోడ్డు, సంఘమేశ్ నగర్‌లో ఉన్న మాంటిస్సోరి పాఠశాలల్లో గణిత శాస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన త్రికోణమితి, పైథాగరస్ సిద్ధాంతాల ఆకృతులు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి, విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవంలో వక్తలు



మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ఉరవకొండ : గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఎవిఆర్ పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పలు గణితానికి సంబంధించిన నమూనాలను ప్రదర్శిస్తూ వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ విక్రమ్‌బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఇంటర్మీడియట్ కళాశాలల్లో 2వ సంవత్సరం ఎంపిసి చదువుతున్న విద్యార్థులు, హైస్కూల్స్‌లో పదవ తరగతి చువుతున్న విద్యార్థులకు గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం గణిత శాస్త్రంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, గణిత విభాగం ఆచార్యులు శాంతి, హరిప్రియ, ఎఒ ఇంతియాజ్ బాషా, డాక్టర్ నరసింహులు, పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను తిలకించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, కోఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక రుద్రంపేట బైపాస్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం సుబ్బారెడ్డి, ఎఒ విజయ్‌కృష్ణన్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, స్వాతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి అమరావతి, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మధుకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-గుత్తి

రైతులతో పాటు ప్రజలకు సంబంధించిన భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామని గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలువురు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబిలేసు, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, సర్వేయర్ సాయి, సర్పంచి ఆర్.గురుమస్తాన్, వీఆర్ఓ టి.సురేంద్ర, వైసిపి నాయకులు ఎస్.రాముయాదవ్, టిడిపి నాయకుడు ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు : మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డిఒ వసంతబాబు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : గ్రామాల్లోని రైతుల భూ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని సనప గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురి నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. కావున రైతుల సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌చౌదరి, టిడిపి నాయకులు సనప పోతలయ్య, రంగనాథరెడ్డి, హరి, తలారి నాగరాజు, ఎడి ఈశ్వరయ్య, సనపు నాగన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత బాంధవుడైన అంబేద్కర్‌పై అమిత్‌షా అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి మతోన్మాదుల పార్టీకి రానున్న రోజుల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వెంటనే అమిత్‌షా అంబేద్కర్‌కు క్షమాపణలు చెప్పి విగ్రహానికి పాలభిషేకం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రాజా, శ్రీనివాస్, శ్రీనునాయక్, ధరణికుమార్, చంటినాయక్, భాస్కర్, అశోక్, రామకృష్ణ, అంజు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'వందరోజులు'ను బహిష్కరిస్తాం : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సెలవు రోజుల్లో వంద రోజుల కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ బహిష్కరిస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ అన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన జోనల్ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు పదవ తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న నూరు రోజుల శిక్షణా కార్యక్రమం 100 అనే సంఖ్య కోసం సిలబస్ పూర్తి కాకుండానే ప్రారంభించడం రెండవ శనివారం ఆదివారం పబ్లిక్ హాలిడేలో పండుగ రోజుల్లో ఇలా ఏ రోజును కూడా వదలకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీనియర్లు పాఠశాల సహాయకులు దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న, మహిళా ఉపాధ్యాయులు ఎంతో మానసిక ఒత్తిడికి లోనై ఆందోళనకు గురవుతున్నారని తద్వారా ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఒక పరీక్షలు పూర్తి చేస్తూ వాటి మూల్యాంకనం పనిలో నిమగ్నమై ఉండగా మరొకవైపు వంద రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం అందులో కూడా ఏలాంటి సెలవులు లేకుండా నిర్విరామంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల తీవ్ర మానసిక వద్దకి గురై బిపి షుగర్లు తెచ్చుకునే దుస్థితి దాపురించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు మా సంఘానికి వ్యక్తిగతంగా ప్రాతినిధ్యం చేస్తున్నారని కావున తక్షణమే ప్రభుత్వం సెలవు రోజుల్లో కేటాయించిన ప్రణాళికను ఉపసంహరించుకొని తిరిగి నూతన ప్రణాళికను జారీచేయాలని లేనియెడల మూకుమ్మడిగా సెలవు రోజుల్లో నిర్వహించ తలపెట్టిన 100 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ సమస్యలను పరిష్కరించండి

జడ్పీ ఛైర్‌పర్సన్‌కు ఎస్‌టియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజినేయులు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయులు నెల నెలా చెల్లిస్తున్న పిఎఫ్ రికవరీలు 2021 మార్చి నుంచి ఆన్‌లైన్ చేయడం లేదని తెలిపారు. నెల నెలా జీతం నుంచి తాము చెల్లిస్తున్న డబ్బులు పిఎఫ్ ఖాతాలో అప్డేట్ చేయకపోవడంతో ఉపాధ్యాయులు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాను అప్డేట్ చేయాలని తెలిపారు.

అలాగే పిఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లు త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెంటనే ఉన్నతాధికారులతో సంప్రదించి కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, జిల్లా సీనియర్ నాయకులు రామకష్ణ పాల్గొన్నారు.